## క్లుప్తంగా

### నేడు గరికపాడులో జగనన్న సురక్ష

కాకుమాను:మండలంలోని గరికపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండలంలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామస్తులు తమ సమస్యల్ని అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

### ఆధునిక పద్ధతులతో లాభసాటి వ్యవసాయం



పెదకాకాని: రైతులంతా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని లాభసాటి వ్యవసాయం చేయాలని జిల్లా వనరుల కేంద్రం పీడీ రామాంజనేయులు సూచించారు. మండలంలోని గోళ్లమూడిలో రైతులకు బుధవారం మెరుగైన వ్యవసాయ పద్ధతులపై పొలంబడి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తుల్ని అందిస్తూ, తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చని సూచించారు. పొలంబడి రైతుల్ని ఓ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి ట్యాగ్ ఆన్ చేసి ధ్రువీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు. దీనిద్వారా రైతులు మద్దతు ధర కంటే ఎక్కువకు పండించిన ఉత్పత్తులు అమ్ముకోవచ్చని చెప్పారు. అనంతరం వరి విత్తనాల మొలక శాతం తెలుసుకోవాలని ట్రే పద్ధతిపై అవగాహన కల్పించారు. పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి సంధ్యారాణి, ఏఈవో శివాజీ, వీఏఏలు విజయలక్ష్మి, జ్యోత్స్న పాల్గొన్నారు.

### ముస్లిం యువతి వివాహానికి బీరువా బహూకరణ



చేబ్రోలు: పొన్నూరు పట్టణం ఒకటో వార్డులోని పేద కుటుంబానికి చెందిన షేక్ రసూల్ కుమార్తె వివాహానికి పొన్నూరు అంజుమన్ కమిటీ చేయూతనందించింది. ఇనుప బీరువాను బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేసింది. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మాము మాట్లాడుతూ పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ కరీముల్లా, డైరెక్టర్లు షేక్ హుస్సేన్, సయ్యద్ జిలాని, షేక్ షకీల్, పఠాన్ హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

### షాదీఖానా నిర్మాణానికి నిధుల మంజూరు



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని 25 వార్డులో నిలిచిపోయిన ముస్లిం షాదీఖానాను బుధవారం సంబంధిత జిల్లా అధికారులు పరిశీలించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య కృషితో జిల్లా కలెక్టర్ తరఫున రూ. 25 లక్షలు మంజూరయ్యాయి. బేస్‌మట్టంలో ఆగిపోయిన నిర్మాణాన్ని, పిల్లర్స్‌ను గుంటూరు నుంచి వచ్చిన అధికారులు పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, త్వరలో పనుల్ని చేపడతామని చెప్పారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పట్టణ ముస్లింలకు ఇచ్చిన హామీల్లో ఆటోనగర్ ఏర్పాటు, 25 వార్డులో షాదీఖానా నిర్మాణాలు ఉన్నాయి. ఎట్టకేలకు షాదీఖానా నిర్మాణం పూర్తికి అడుగులు పడుతున్నాయి. హామీలు నెరవేర్చడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు పొన్నూరు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మాము, కమిటీ సభ్యులు, 17 మసీదుల కమిటీల సభ్యులు, పొన్నూరు పట్టణ ముస్లిం మత పెద్దలు అభినందనలు తెలిపారు.

### నేడు, రేపు ఐటీ ఫైలింగ్‌పై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆదాయపు పన్నుశాఖ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సంయుక్తంగా గురు, శుక్రవారాల్లో ఐటీ ఫైలింగ్‌పై ఉచిత అవగాహన, సలహా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ మద్ది రవితేజ బుధవారం తెలిపారు. వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు, పెన్షనర్లకు ఎంతో కీలకమైన ఐటీ ఫైలింగ్‌పై సందేహాలను నివృత్తి చేసేందుకు అనుభవజ్ఞులైన సీఏలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాసరావు పేట 60 అడుగుల రోడ్డులోని ఐసీఏఐ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే శిబిరంలో ఐటీ ఫైలింగ్‌పై జరిగే శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పవన్ కల్యాణ్... క్షమాపణ చెప్పు !

**వెంగళాయపాలెంలో వలంటీర్ల నిరసన, దిష్టిబొమ్మ దహనం**



పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టుకుంటూ తీసుకెళుతున్న వలంటీర్లు

గుంటూరు రూరల్: స్వచ్ఛందంగా సేవ చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రజలకు ఇంటివద్దకే అందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనలు వెల్లువెత్తాయి. వెంగళాయపాలెంలో వలంటీర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సచివాలయం కూడలి వద్ద పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ అసభ్యకరంగా మాట్లాడిన పవన్ కల్యాణ్ తమకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఖబడ్దార్ పవన్ కల్యాణ్... డౌన్ డౌన్ పవన్ కల్యాణ్.. సంస్కారంలేని పవన్.. చంద్రబాబు తొత్తు పవన్ అంటూ నినాదాలు చేశారు. ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, సచివాలయ కన్వీనర్లు బుజ్జమ్మ, దుగ్గెంపూడి శ్రీనివాస్, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

**వలంటీర్లకు పవన్ కల్యాణ్, నాగబాబు క్షమాపణ చెప్పాలి**

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసును వలంటీర్లను తిట్టడం ద్వారా జనసేన పవన్ కల్యాణ్ ముచ్చట తీర్చుకోవాలని భావిస్తే, అవే తిట్లు గోడకు కొట్టిన బంతిలా తిరిగి ఆయనకే తగులుతాయని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ బుధవార ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్‌కు కనీస ఇంగిత జ్ఞానం ఉందా? రాజకీయ ప్రత్యర్థుల్ని ఎదుర్కోవడానికి సిగ్గు లేకుండా వలంటీర్ల మీద పడి ఏడవడం దేనికి? అని ప్రశ్నించారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నిరుద్యోగ సమస్యతో సతమతం అవుతున్న చాలా మందికి వలంటీర్ ఉద్యోగాల ద్వారా ఉపాధి కల్పిస్తే.. దాన్ని కూడా రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూడటం దారుణమని ఖండించారు.'' అసలు నీకు ఒక అజెండా ఉందా? తలా తోక లేకుండా మాట్లాడుతున్నావు.. దానికి అన్నయ్య నాగబాబు వత్తాసు పలకడం మరీ దారుణ''మని ధ్వజమెత్తారు. తమ్ముడు తప్పు మాట్లాడితే సరి చేయాల్సిన అన్నయ్య తప్పును సమర్థించడం అంటే నాగబాబు కూడా తప్పు చేస్తున్నట్లేనని తెలిపారు. పవన్ కల్యాణ్, నాగబాబు ఇద్దరు వలంటీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ఊరుకోమని దేరంగుల ఉదయ్‌కిరణ్ హెచ్చరించారు.

## ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో సమగ్ర గైనకాలజీ సేవలు

**డీసీహెచ్ఎస్ డాక్టర్ జి. హనుమంతరావు**



ప్రత్తిపాడు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ జి. హనుమంతరావు తదితరులు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజీ సేవల్ని ప్రజలు వినియోగించుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ జి. హనుమంతరావు సూచించారు. ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఓపీ, డాక్టర్ రికార్డులతో పాటు ఫార్మసీ రికార్డుల్ని పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందికి వెంటనే మెమోలు జారీ చేయాలని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ నాగార్జునకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ సీహెచ్‌సీలో ప్రభుత్వం అన్ని విభాగాలకు వైద్యుల్ని నియమించిందని తెలిపారు. ఎంతోకాలంగా ఖాళీగా ఉన్న గైనకాలజీ పోస్టును కూడా భర్తీ చేసిందని చెప్పారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ కూడా వినియోగంలోకి తెచ్చామని, ఇక నుంచి నిత్యం ఇక్కడ కాన్పులతో పాటు శస్త్ర చికిత్సలు కూడా జరగనున్నాయని వివరించారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్యుల్ని నియమించిందని తెలిపారు. వైద్యులు కూడా 24 గంటలూ ఆస్పత్రిలో అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఆయన ఆదేశించారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో పోలీసులు

గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై, తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం 2వ లైనుకు చెందిన విప్పె సాయికృష్ణ వరఫ్ వ్యసనాలకు బానిసై గంజాయి విక్రయాలకు పాల్పడుతుంటాడు. విజయవాడలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి నగర శివారులో లింగాయపాలెం ప్లాట్ల వద్ద కూలీలు, డ్రైవర్లు, విద్యార్థులకు పొట్లం రూ. 400కు విక్రయిస్తుంటాడు. లింగాయపాలెం ప్లాట్లలో సాయికృష్ణ గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అతడి వద్ద నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు. నిందితుడ్ని చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ అశోక్, సిబ్బంది సుబ్బారావు, జాన్ సైదా, పోతురాజు, వెంకటనారాయణ, మస్తాన్‌ను ఆయన అభినందించారు.

# ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి

**జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో ఆర్. కేశవరెడ్డి, ఎంపీడీవో శ్రీరమ్య

ప్రత్తిపాడు: ప్రభుత్వ లక్ష్యాల మేరకు గృహ నిర్మాణాల్ని పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈవోపీఆర్డీ మావులూరి మోషె అధ్యక్షతన గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో లబ్ధిదారులకు గృహ నిర్మాణంపై విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జగనన్న కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నిర్మాణాలకు ముందుకు వచ్చే లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నగదుతో పాటు అదనంగా వైఎస్సార్ క్రాంతి పథం నుంచి రూ. 30 వేలను ఇస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభించిన లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరమ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం పోలీసుల కుటుంబాలకు అధికారులు చెక్కులు అందజేశారు. పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్ఐగా విధులు నిర్వర్తించే వెంకట్రావు బ్రెయిన్ స్ట్రోక్‌తో గతనెల ఆరో తేదిన మృతి చెందారు. ఈ మేరకు విడోఫ్లాగ్ ఫండ్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కుని వెంకట్రావు భార్య శ్రీదేవికి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ అందించారు. తెనాలి సబ్ డివిజన్ పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వర్తించే ఎ.శ్రీనివాసరాజు, మంగళగిరి పట్టణ పీఎస్ కానిస్టేబుల్ కె.మాధవరావు, నార్త్ సబ్ డివిజన్ మంగళగిరిలో హెచ్‌సీ పి.శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శ్రీనివాసరాజు భార్య ప్రతిభారాణి, మాధవరావు భార్య స్వర్ణ, శ్రీనివాసరావు భార్య నాగమణిలకు రూ.1 లక్ష చెక్కులను ఏఎస్పీ కె.సుప్రజ అందించారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యతోనే వ్యక్తిత్వ వికాసం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్టెప్ మేనేజర్ రాధిక

గుంటూరు రూరల్: విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని స్టెప్ మేనేజర్ బి. రాధిక తెలిపారు. మండలంలోని నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం విజయవాడకు చెందిన యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్. పల్లవి ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్ని వివరించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలు గురించి కౌన్సిలర్ ఎస్. అయ్యప్ప వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. భవిష్యత్తులోఉన్నత స్థితికి ఎదిగేందుకు పాటించాల్సిన విద్యా విధానాలు, సలహాలను సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు కె. చంద్రికరాణి, సీహెచ్. శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం



పుట్లా దేవల్యమ్మను సన్మానిస్తున్న స్టేట్ బ్యాంక్ అధికారులు

చేబ్రోలు: ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా స్వాతంత్ర సమరయోధులు, వారి కుటుంబ సభ్యుల్ని సన్మానించడం హర్షణీయమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొన్నూరు బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. పొన్నూరు పట్టణంలోని పాత పొన్నూరుకు చెందిన స్వాతంత్ర సమరయోధులు, మాజీ శాసనసభ్యులు పుట్లా సుబ్బయ్య కుమార్తె పుట్లా దేవల్యమ్మను బుధవారం స్టేట్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది ఆమె స్వగృహంలో కలసి ఘనంగా సన్మానించారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధులు, వారి వారసులను సన్మానించాలనే ఉద్దేశంతో ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. స్వాతంత్య్ర సమరయోధుల సేవల్ని ప్రస్తుత, భావితరాల వారికి తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత పుట్ల దేవల్యమ్మ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన త్యాగమూర్తులు గుర్తుండే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆజాద్ కా అమృత్ మహోత్సవం ఏర్పాటు చేసి వారి కుటుంబ సభ్యుల్ని సన్మానించడం సంతోషదాయకమని తెలిపారు. కార్యక్రమంలో పుట్ల సుబ్బయ్య కుటుంబ సభ్యులు, స్టేట్ బ్యాంక్ అధికారులు సిబ్బందితో పాటు, పుట్లా జైపాల్, పుట్లా గోపాలరావు, పుట్లా సంపత్, పుట్లా రాజీవ్ పాల్గొన్నారు.

# మెరుగైన ర్యాంకు కోసం ఓటెయ్యండి

- స్వచ్ఛ సర్వేక్షణ్- 2023కి సహకరించాలి
- కమిషనర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో నగరానికి మెరుగైన ర్యాంక్ కోసం ఓట్ ఫర్ యువర్ సిటీకి నగర ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా తమ అభిప్రాయాల్ని ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియజేయాలని ఆమె సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నగరవాసులు నేరుగా mygovpatgom, rwacchata app, rr2023 vote for your city app, rr2023 vote for your city web ల ద్వారా తెలపాలని సూచించారు. ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాల్ని చెప్పాలని కోరారు. ఇది ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల అభిప్రాయం కోసమే నిర్వహించే ఓటింగ్ అని, ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆమె తెలిపారు. ప్రజారోగ్య కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, యాప్‌ల వినియోగం, ఓటీపీ అంశాలపై అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు.

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

**ఉపాధ్యాయులకు జేసీ రాజకుమారి హెచ్చరిక**



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు రూరల్: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయుల్ని జేసీ రాజకుమారి హెచ్చరించారు. మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డుల్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. విధుల్లో అలసత్వం వహించవద్దని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్మీడియేట్ కాలేజీల్లో చేరారో.. లేదో ? సమాచారం సేకరించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని ''చైల్డ్ ఇన్ఫో వెబ్ సైట్''లో నమోదు చేసింది.. లేనిది? ఆరా తీశారు. ఇంకా నమోదు చేయని విద్యార్థులు ఉంటే వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద నాణ్యత గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. జగనన్న విద్యాకానుక పంపిణీ వివరాలు, నాడు -నేడు పనుల పురోగతిపై సమీక్ష జరపాలని హెచ్ఎంని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, హెచ్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

## చదువుతోనే కుటుంబాల్లో వెలుగులు



డ్రాపవుట్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఈవో రమాదేవి

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): చదువుతోనే కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని ఎంఈవో సీహెచ్. రమాదేవి అన్నారు. మండలంలో గత ఏడాది పాఠశాలల్లో చదివి, ఈ ఏడాది ఇప్పటి వరకూ బడికి రాని డ్రాపవుట్స్ సుమారు రెండు వందల మంది ఉన్నారు. వారందరినీ బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు ఇంటి బాట పట్టారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో డ్రాపవుట్స్ విద్యార్థుల జాబితాల్ని తీసుకుని స్థానిక ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలతో కలసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లవాడు పాఠశాలకు ఎందుకు రావడం లేదన్న వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు కచ్చితంగా పాఠశాలలోనే ఉండాలని, వారిని పనులకు పంపరాదని తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని, కచ్చితంగా పిల్లల్ని తిరిగి బడికి పంపించాలని ఎంఈవో సూచించారు.

## వీవీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటేష్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు మునగాల వెంకటేష్‌కి కాకినాడ జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ఇమేజ్ వీడియో ప్రాసెసింగ్ అల్గారిథమ్స్‌పై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ పట్టా పొందారు. అధిక సామర్థ్యం గల వీడియో కోడింగ్ కోసం ఎన్‌కోడింగ్ పద్ధతులు మెరుగుపరచడంపై పరిశోధన పత్రాల్ని ప్రొఫెసర్ కె. సత్యప్రసాద్ పర్యవేక్షణలో సమర్పించారు. నంబూరు వీవీఐటీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకుడు వెంకటేష్‌ను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్. కుమారస్వామి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వై. భానుమూర్తి అభినందించారు.

### చలపతి అధ్యాపకుడికి ...



షేక్ అలిమాన్

గుంటూరు రూరల్: చలపతి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ అలిమాన్‌కు రాజస్థాన్‌కు చెందిన శ్రీ జగదీష్‌ప్రసాద్ జబర్‌మల్ తిబ్రేవాలా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన డాక్టర్ ఎస్. నాగప్రసాద్ పర్యవేక్షణలో యాన్ ఎంపరికల్ ఎప్రోర్చ్ ఇన్ డిరర్ మైనింగ్ క్లయిమెట్ ఎన్‌జిమ్‌బుల్స్ పెరామీటర్స్ ఫర్ మల్టి ఫిజికల్ రీజనబుల్ ఎప్రోచ్ అండర్ క్లవుడ్ ఎనాలసిస్ అనే అంశంపై పరిశోధన చేశారు. లాంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకుడు అలిమాన్‌ను ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్, చైర్మన్ వై.వి. ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ సుజిత్, డాక్టర్ ఎ. బాలాజీ అభినందించారు.

## పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ల దొంగ

పెదకాకాని: చాకచక్యంగా సెల్‌ఫోన్లు మాయం చేసే దొంగను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. పశ్చిమ గోదావరి భీమవరం, ఉండి ప్రాంతాలకు చెందిన ఒక ముఠా సిండికేట్‌గా ఏర్పడి రాష్ట్రంలోని నలుమూలలకు బైక్‌లపై తిరుగుతూ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతోంది. టీం లీడర్ ఎప్పటికప్పుడు వారి సమాచారాన్ని తెలుసుకుంటూ, పోలీసులకు పట్టుబడినపుడు చట్టంలో లొసుగుల్ని తెలివిగా ఉపయోగించుకుని బయటపడుతున్నారు. జనాలు ఎక్కువగా ఉన్న సెంటర్లలో ఫోన్ దొంగతనాలకు ప్రణాళిక తయారు చేసుకుంటారు. బైక్‌పై ఉన్న వ్యక్తి జనం ఎక్కువగా ఉన్న ప్రదేశంలో ఫిట్స్ వచ్చినట్లుగా, బైక్ అదుపు తప్పినట్లుగా కిందపడిపోతాడు. అయ్యో పాపం అంటూ అక్కడికి చేరుకుని కింద పడిన వ్యక్తిని పైకి లేపేలోగా.. బైక్‌పై వచ్చిన రెండవ వ్యక్తి సమీపంలో ఉంటూ అనుసరిస్తాడు. బైక్‌పై నుంచి కింద పడగానే వారితో కలసి అతను కూడా సాయం చేసినట్లు పబ్లిక్‌లో కలసిపోతాడు. కింద పడిన వ్యక్తిని పైకి లేపే పనిలో స్థానికులు ఉండగా వారి జేబులో ఫోన్ మాయం అవుతుంది. కొద్దిసేపటికి కింద పడిన వ్యక్తి కూడా బైక్‌పై వెళ్లిపోతాడు. ఏడాది కిందట ఇదే తరహాలో పెదకాకాని ప్రధాన సెంటర్‌లోనూ, సుందరయ్యకాలనీ వద్ద సెల్‌ఫోన్ల చోరీ జరిగింది. అదే పద్ధతిలో పెదకాకానిలో మంగళవారం ఇద్దరి జేబుల్లో ఫోన్లు మాయం అయ్యాయి. అయితే, ఈ సారి పథకం పారలేదు. స్థానికులు దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి ఉండి భీమవరానికి చెందిన కుక్కల రాజాగా గుర్తించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూఎస్ఏకు చెందిన నార్త్ సౌత్ ఫౌండేషన్ రూ. 23,25,000 విలువ గల చెక్కులను తమ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో అందించిందని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 94 మంది అర్హత కలిగిన ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కుల్ని అందించినట్లు తెలిపారు. ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉన్నత లక్ష్య సాధనకు గొప్ప వ్యక్తిత్వం, మానవ సంబంధాలు, వృత్తిపై గౌరవం, సామాజిక బాధ్యత, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. నార్త్ సౌత్ ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కో- ఆర్డినేటర్ లయన్ సూరపనేని వెంకటరత్నం మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు మంచి ఉద్యోగాలు చేయాలని ఆకాంక్షించారు. తమ వేతనంలో కొంత భాగం పేద విద్యార్థులకు అందించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్ద మొత్తంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన నార్త్ సౌత్ ఫౌండేషన్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు తదితరులు నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధుల్ని శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు.

## నగరపాలక సంస్థ ఉద్యోగినికి చార్జ్ మెమో

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగినికి నగర కమిషనర్ కీర్తి చేకూరి మెమో చార్జ్ మెమో జారీ చేశారు. వివరాలు.. నగరపాలక సంస్థలో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ గత నెలలో రెవెన్యూ విభాగంలో ఏ-2గా కేటాయించిన బాధ్యతలు స్వీకరించకుండా, అధికారుల అనుమతి లేకుండా ఎల్.శ్రీదేవి ఫేక్ మెడికల్ సర్టిఫికెట్‌తో దీర్ఘకాల సెలవులో వెళ్లారు. కేటాయించిన బాధ్యతలు తీసుకుకోకపోవడం, ఉన్నత అధికారులకు ఎటువంటి సమాచారం అందించకపోవడం వల్ల నగరపాలక సంస్థ ఆదాయ వనరులకు భంగం వాటిల్లింది. నగరంలో గడువు ముగిసిన ఆశీలు రెన్యువల్ జాప్యంపై ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా చర్చకు వచ్చింది. ఇందుకు కారణమైన శ్రీదేవి వ్యవహారశైలిపై కమిషనర్ అదనపు కమిషనర్‌ని విచారణకు ఆదేశించారు. సదరు మెడికల్ సర్టిఫికెట్లను తనిఖీ నిమిత్తం మెడికల్ బోర్డ్‌కు పంపారు. అవి నకిలీవని బోర్డ్ నివేదిక ఇచ్చింది. కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించిన శ్రీదేవిపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ రూల్స్-1991 ప్రకారం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చార్జిమెమో జారీ చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల్లో రాతపూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.